క్లుప్తంగా

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

మాడుగుల రూరల్: మండలంలో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. స్థానిక ఆర్‌సీఎం హైస్కూల్ పరీక్ష కేంద్రంలో శనివారం జరిగిన హిందీ పరీక్షకు 15 మందికి గాను నలుగురు విద్యార్థులు మాత్రమే హాజరైనట్టు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సుజాత డోమినిన్ తెలిపారు. 11 మంది గైర్హాజరయ్యారని ఆమె చెప్పారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు



మాట్లాడుతున్న సీఐ హరి

గొలుగొండ: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి హెచ్చరించారు. అన్ని రాజకీయపార్టీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్‌ను ఎవరూ ఉల్లంఘించరాదన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో బాణసంచా, సౌండ్‌బాక్సుల వినియోగం, ఊరేగింపులు నిషేధమని తెలిపారు. నాయకుల గెలుపు, ఓటములపై బెట్టింగులు కాస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం వృద్ధి

చీడికాడ: పచ్చిరొట్ట విత్తనాలు వేయడం వల్ల భూసారం వృద్ధి చెందుతుందని మండల వ్యవసాయాధికారి కె.రమాదేవి తెలిపారు. దుక్కి దున్నిన పొలంలో నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, జనుములలో ఏదో ఒక దానిని జల్లుకోవాలని రైతులకు సూచించారు. మండలంలో జీలుగు విత్తనాలు 15.80 క్వింటాళ్లు, జనుము 2.20 క్వింటాళ్లు, పిల్లిపెసర విత్తనాలు 1.54 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

మాడుగుల రూరల్: అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు ఆ పనుల్లో బిజీగా ఉన్నారు. చెరకు దవ్వనాట్లు వేస్తుండడంతో పాటు ఖరీఫ్ వరి నారు మడులు సిద్ధం చేస్తున్నారు.

డి.అగ్రహారంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



డి.అగ్రహారంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్

కె.కోటపాడు : ప్రజలకు మెరుగైన వైద్య సేవలను ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా అందిస్తున్నట్టు వైద్యాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. డి.అగ్రహారంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించి, 129 మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.ఎంఎల్‌హెచ్‌పీ మీనాక్షి, ఏఎన్ఎం ముత్యవమ్మ, హెచ్.వి. భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

3న పలు దేవాలయాల భూములకు వేలం

మునగపాక : మండలంలోని పలు దేవాలయాల భూముల కౌలుకు జూన్ 3న వేలంపాట జరుగుతుందని దేవదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి పి.సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పాటిపల్లిలో 3.48 ఎకరాలు, ఒంపోలుకు సంబంధించి 1.92 ఎకరాలు, అనకాపల్లి సోత్‌కు సంబంధించి 1.96 ఎకరాలు, తోటాడకు సంబంధించి 1.78 ఎకరాలు వెరసి 9.14 ఎకరాల మేర దేవదాయ శాఖకు చెందిన భూములున్నాయన్నారు. సంబంధిత భూములకు వేలం పాట నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాటిపల్లిలోని అహోబిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో జూన్ 3వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం పాట జరుగుతుందన్నారు. మూడేళ్ల కాల పరిమితికి వేలం పాట ఉంటుందన్నారు. 04-06-2024 నుంచి 03-06-2027 వరకు కాల పరిమితి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పాటదారులు సద్వినియోగం చేసుకోవాలని మూర్తి కోరారు.



శనివారం కొండపైకి వేసిన రహదారిని పరిశీలిస్తున్న ఏపీవో, ఫీల్డ్ ఉద్యోగి



అడవిరాజు బాబు కొండపై సాగుభూమి

సాగుకు 'మార్గం' సుగమం

- అడవిరాజుబాబు కొండపైకి రోడ్డు నిర్మాణం ప్రారంభం
- తీరనున్న 20 ఏళ్ల కల
- హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్సీ రైతులు



రహదారి నిర్మాణ పనుల్లో కూలీలు

రావికమతం: మండలంలోని ఒమ్మవరం ఎస్సీ రైతుల 20 ఏళ్ల కల సాకారం కానుంది. వారు వ్యవసాయం చేసేందుకు మార్గం సుగమమైంది. ఎమ్మెల్యే కృషి ఫలితంగా రోడ్డు సదుపాయం అందుబాటులోకి వస్తుండడంతో పాటు వారి పొలాలు సాగులోకి రానుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒమ్మవరం శివారులో ఉన్న అడవిరాజుబాబు కొండపై సాగుకు అనుకూలమైన 52 ఎకరాల భూమి ఉంది. దీనిని సాగుచేసుకునేందుకు 15 మంది ఎస్సీ రైతులకు 20 ఏళ్ల క్రితం అప్పట్లో ప్రభుత్వం పట్టాలిచ్చింది. అయితే కొండపైకి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆ రైతులు వ్యవసాయం చేయలేకపోయారు. కొండంతా చెట్లు పెరిగిపోయి అడివిలా మారిపోయింది. దీనిపై ఇన్నాళ్లూ ఎవరూ శ్రద్ధ చూపకపోవడంతో ఆ రైతులు కూడా కూలిపనులు చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు. రెండు నెలల క్రితం కొండపైకి రోడ్డు వేయాలని ఆ రైతులు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని కోరారు. స్పందించిన ఆయన ఉపాధి హామీ పథకంలో రహదారి నిర్మించి, ఆ రైతుల జీవన ప్రమాణం మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. కొండపైకి రహదారి నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలించారు. ఒక కిలోమీటరు మేర ఘాట్ మాదిరిగా కొండ తొలచి రోడ్డువేయవచ్చని నిర్ణయానికి వచ్చారు. కొండపై ఉన్న భూములను సైతం అభివృద్ధి చేసి సాగులోకి తేవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ఏపీవో దాడి వెంకట కాశి అప్పారావు, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ బైరాగి శనివారం పనులను ప్రారంభించారు. రోజుకు 250 మంది కూలీలను ఉపయోగించి పనులు చేస్తామని ఈ సందర్భంగా ఏపీవో కాశి అప్పారావు తెలిపారు.

పైపులైన్‌కు రంధ్రం

17 గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా



వృథాగా పోతున్న నీరు

మాకవరపాలెం: పైపులైన్‌కు రంధ్రం పడడంతో 17 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. మండలంలోని గిడుతూరు శివారు వరాహనదిలో ఉన్న భారీ తాగునీటి ప్రాజెక్టు నుంచి మండలంలోని సుమారు 40గ్రామాలకు నిత్యం తాగునీరు సరఫరా అవుతుంది. నీటిని సరఫరా చేసే పైపులైన్‌కు కొండలఅగ్రహారం వద్ద శనివారం రంధ్రం పడింది. దీంతో జి.గంగవరం, సీతన్నఅగ్రహారం, శ్రీరాంపురం,హరప్పాఅగ్రహారం,గిడుతూరు,బయ్యవరం, ఎన్.జి.ఆర్.పి. అగ్రహారం, తామరం, రాచపల్లి, కొత్తపాలెం, బి.బి.పాలెం,చింతూలూరు, దుంగలవానిపాలెం, గండిపేట, జెడ్.గంగవరం, శెట్టిపాలెం ,వెంకన్నపాలెం గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. రంధ్రం పడిన చోట తాగునీరు వృథాగా పోతోంది. మూడు రోజుల్లో పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి మళ్లీ యథావిధిగా నీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివారెడ్డి తెలిపారు.

1న మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వచ్చేనెల ఒకటో తేదీన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఆర్.కాళీ ప్రసాద్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి తీర్మానాలు ఉండవని స్పష్టం చేశారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మండలంలో గల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన తెలిపారు.

శిథిలావస్థలో వంతెనలు



పెదగొలుగొండపేట, చిన గొలుగొండపేట మధ్య ఏలేరు కాలువపై ఉన్న వంతెన

నాతవరం: ఏలేరు కాలువపై పలు చోట్ల నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. మండలంలో 13 పంచాయతీల మధ్యలోంచి 25 కిలోమీటర్ల పొడవున ఏలేరు కాలువ ఉంది. ప్రజలు రాకపోకలు సాగించేందుకు, వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు ఈ కాలువపై చాలా చోట్ల వంతెనలు నిర్మించారు. వీటిలో పలు వంతెనలు శిథిలావస్థకు చేరుకుని, ఏ సమయంలో కూలిపోతాయో తెలియని స్థితిలో ఉన్నాయి. పెదగొలుగొండపేట, ఎ.శరభవరం, జిల్లేడుపూడి, గునుపూడి, పీకే గూడెం, ఏపీ పురం, లింగంపేట,మన్యపురట్ల, కొండ ధర్మవరం ప్రాంతాల్లో కాలువపై గల వంతెనల్లో చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రమాదకరంగా ఉన్న వంతెనలకు కనీసం మరమ్మతులైన చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరారు.

పర్తి యాత్రకు సత్యసాయి భక్తులు తరలిరావాలి



పెదనందిపల్లిలో సత్యసాయి బాబా చిత్రపటం వద్ద పూజ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు

దేవరాపల్లి: పుట్టపర్తిలో అక్టోబర్‌లో జరిగే పర్తియాత్రకు జిల్లా వ్యాప్తంగా వేలాదిగా సత్యసాయి భక్తులు తరలిరావాలని భగవాన్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు కోరారు. మండలంలోని పెదనందిపల్లిలో శనివారం సత్యసాయి సేవా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యసాయి బాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పుట్టపర్తిలో ఏటా మాదిరిగా అక్టోబర్ 23 నుంచి 25 వరకు పర్తి యాత్ర ఘనంగా జరుగుతుందన్నారు. ఈ యాత్రకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చేలా అందరూ కృషి చేయాలన్నారు. ఎప్పటి మాదిరిగా ఆధ్యాత్మిక సమావేశాలు, భజనలు, బాల వికాస్ తరగతులు యథావిధిగా కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో దేవరాపల్లి మండల సత్య సాయి సేవా సమితి నూతన అధ్యక్షుడిగా ఆదిరెడ్డి చినకన్నబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నౌడు అప్పారావు, గంధం సూర్యం, రమామణి, సీహెచ్.వి. రవిశంకర్, జగన్నాథం తదితర సత్య సాయి సేవా సమితి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

అరటి సాగులో మెలకువలపై అవగాహన



అరటి గెలలకు కవరు కట్టడంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రావికమతం: అరటి సాగులో మెలకువలపై ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు మేడివాడ రైతులకు శనివారం అవగాహన కల్పించారు. గ్రామీణ వ్యవసాయంలో మెలకువలు, యాంత్రీకరణ పద్ధతులను రైతులకు వివరించే కార్యక్రమంలో భాగంగా మేడివాడ గ్రామానికి చెందిన గొర్లె కృష్ణ,గంటా నాయుడు అరటి తోటలను వారు పరిశీలించారు. గెలలకు కవరు కట్టే విధానాన్ని వివరించారు. కవరు కట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీసీ రాజ్‌కుమార్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గడ్డి విక్రయాలతో రైతులకు ఆదాయం



ట్రాక్టర్‌తో తరలిస్తున్న వరి గడ్డి

రాంబిల్లి : వరి గడ్డి వ్యాపారం దాదాపు ముగిసింది. రాంబిల్లి మండలం నుంచి ఖరీఫ్, రబీ సీజన్లలో పండించిన వరి నూర్పిడి అనంతరం గడ్డిని వ్యాపారులు కొనుగోలు చేసి ట్రాక్టర్ల సాయంతో పలు మండలాలకు తరలించి విక్రయించారు. పొలాల్లో గడ్డి కుప్పలను దాదాపు తరలించే ప్రక్రియ ముగిసింది. ఎకరాలో పండించిన వరి గడ్డి రూ.5 వేల నుంచి 6 వేలకు రైతులు వ్యాపారులకు విక్రయించారు. ఇలా కొనుగోలు చేసిన గడ్డిని పలు మండలాలకు తరలించి విక్రయాలు జరిపారు. గడ్డి విక్రయంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరింది.

విద్యుత్ భద్రతపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డీఈఈ రామకృష్ణ



విద్యుత్ భద్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న సాంకేతిక సిబ్బంది

కశింకోట: విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ భద్రత పనిముట్లను ఉపయోగించాలని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ కోరారు. విద్యుత్ భద్రతపై సాంకేతిక సిబ్బందికి స్థానిక ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది మాత్రమే కాకుండా వినియోగదారులు, భవన నిర్మాణ కార్మికులకు కూడా విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా సూచనలు, సలహాలను అందించాలని సిబ్బందికి సూచించారు.

అనుభవజ్ఞులైన సిబ్బంది సూచనలు, సలహాలు పాటించి భద్రతా చర్యలు తీసుకుని, విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలన్నారు. ఈ మేరకు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జి.శివ సత్యనారాయణ, ఎస్.సురేష్, బి.నిరీక్షణ్, డి.శివశంకర్‌ప్రసాద్, బి.కనకారావు, ఏఈలు వి.శివకుమార్, ఎం. దుర్గాప్రసాద్, జి.అశోక్‌కుమార్, బి.ఎల్.వి.నాయుడు, పి.శ్రీనివాస్, జె.వి.లక్ష్మణ్‌కుమార్, బీవీకే ప్రకాష్, బి.వీరేంద్ర, ఎస్.గోపి పాల్గొన్నారు.

విశేష అలంకరణలో ధ్యాన వేంకటేశ్వరుడు



కశింకోట: కశింకోటలోని వేంకటేశ్వర స్వామి ధ్యాన మందిరంలో శనివారం విశేష పూజలు చేశారు. స్వామి వజ్రకవచంలో దర్శనమిచ్చారు. శ్రీనివాసుడిని పుష్పమాలలు, తులసి మాలలతో నిండుగా అలంకరించారు. సహస్ర నామాలతో అర్చించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ముగిసిన తిరు కల్యాణోత్సవాలు

కశింకోట: కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో తిరు కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఐదు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాల్లో చివరి రోజు శుక్రవారం రాత్రి అష్టదళ పద్మార్చన, పుష్ప యాగం, పవళింపు సేవ, ద్వాదశ కాలార్చన, బేడా సేవ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు, కార్యనిర్వహణాధికారి కీర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆపన్నహస్తం

కశింకోట : స్థానిక గవరపేటకు చెందిన కౌలు రైతు పాలమరశెట్టి జగ్గారావు మృతి చెందగా అతని కుటుంబానికి ప్రజా సంఘాల ప్రతినిధులు శనివారం పాడి ఆవును అందజేసి ఆసరాగా నిలిచారు. అప్పుల బాధ భరించలేక జగ్గారావు గత ఏడాది జూన్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎవరి నుంచి ఎటువంటి సహకారం లేక కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతు స్వరాజ్య వేదిక కో-కన్వీనర్ గాడి బాలు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరు, జిల్లా సహాయ కార్యదర్శి కోరుకొండ నాగరాజు పాడి ఆవును కొనుగోలు చేసి అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

ఉత్సాహంగా డ్రాయింగ్, ఆటల పోటీలు



కొత్తకోట గ్రంథాలయంలో వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న బాలలు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న చౌడవాడ గ్రంథాలయాధికారి పద్మావతి

రావికమతం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండలంలోని కొత్తకోట శాఖా గ్రంథాలయంలో బాల బాలికలకు నిర్వహించిన ఆటలు, డ్రాయింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. వీటితో పాటు పుస్తకాలు చదవడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి వచ్చేనెల 7వ తేదీన నిర్వహించే ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని వరహామణి తెలిపారు.

కె.కోటపాడు : వేసవి విజ్ఞాన శిబిరాన్ని వచ్చే నెల 8వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చౌడువాడ గ్రంథాలయం వద్ద శనివారం విద్యార్థులతో నీతి కథలు చదివించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు.



రోలుగుంట గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

రోలుగుంట: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. శనివారం విద్యార్థులతో నీతి కథలు చదించారు. నిజాయితీగా ఉండడం,దాని వల్ల కలిగే మేలు గురించి గ్రంథాలయాధికారి వివరించారు.

విద్యుత్ వైర్లను సరిచేయాలి



కూర్మానాథపురం గట్టావారి కల్లాల వద్ద వేలాడుతున్న విద్యుత్ వైర్లు

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోడూరు నుంచి కూర్మానాథపురం గ్రామానికి వెళ్లే రహదారిలో గట్టా వారి కల్లాల వద్ద విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నట్టు స్థానిక రైతులు గొల్లవిల్లి సూరిబాబు, కొప్పు నర్సింహమూర్తి, కొప్పు కృష్ణారావు, తదితర్లు తెలిపారు. ట్రాక్టర్ మీద ఎండు గడ్డిని తీసుకు వెళ్లేటప్పుడు విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని వారు చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి వైర్లను సరిచేయాలని వారు కోరారు. ఈ విషయాన్ని మాడుగుల విద్యుత్ ఏఈ ఎం.రాంబాబు వద్ద ప్రస్తావించగా విద్యుత్ వైర్లను పరిశీలించి, సరిచేస్తామని చెప్పారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



జేపీ అగ్రహారంలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ నూకరాజు

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. వర్షాలు కురుస్తుండంతో పారిశుద్ధ్యం క్షీణించి,వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున డీపీవో శిరీష రాణి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తమయ్యారు. కాలవల్లో పూడికలు తీయించడంతో పాటు వీధులను శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. జేపీ అగ్రహారం, జానకీరాంపురం, కుసర్లపూడి, కొమరవోలు గ్రామాల్లో జరుగుతున్న పనులను ఈవోపీఆర్డీ నూకరాజు శనివారం పర్యవేక్షించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

44 మందికి క్యాన్సర్ పరీక్షలు



క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాకవరపాలెం: బూరుగుపాలెం పీహెచ్‌సీ పరిధిలోని తూటిపాలలో 44 మందికి శనివారం క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులతో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌కు కారణాలు, లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరీక్షలు నిర్వహించిన 44 మందిలో పది మందికి క్యాన్సర్ లక్షణాలున్నట్టు గుర్తించారు. క్యాన్సర్ వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఆ లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు సంగీత, నమిత సూచించారు. క్యాన్సర్ నివారణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూరుగుపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేవు పోలవరం పాఠశాలలో తనిఖీ



రేవుపోలవరం పాఠశాలలో తనిఖీ చేస్తున్న విద్యా కమిటీ చైర్మన్

ఎస్.రాయవరం : రేవుపోలవరం ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీల ఏర్పాటు సక్రమంగా లేదన్న ఫిర్యాదు మేరకు శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు సమక్షంలో పాఠశాల కమిటీ చైర్మన్ చోడిపల్లి అప్పన్న తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నాడు నేడు పథకంలో విద్యార్థులకు నాణ్యమైన బోధన చేపట్టాలనే ఉద్దేశంతో మూడు నెలలు క్రితం పాఠశాలలో ఐఎఫ్‌పీ సామగ్రి సమకూర్చారు. పాఠశాలలకు చేరిన వెంటనే వైరింగ్ చేయించి వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఈ పాఠశాలలో మాత్రం పూర్తి స్థాయిలో బిగించకుండానే ఏర్పాటు చేసినట్టు స్థానిక ఉపాధ్యాయులు నివేదిక ఇచ్చారని, ఈ విషయంపై డీఈవోకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు పరిశీలనలో ఇదే విషయం బయటపడిందని అప్పన్న తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక డిప్యూటీ డీఈవో అప్పారావు దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలలు పునఃప్రారంభంలోపు పూర్తి స్థాయిలో ఐఎఫ్‌పీ బోర్డులు ఏర్పాటు పూర్తి చేసి విద్యాబోధన జరిగేలా చూస్తామన్నారు. ఈ పరిశీలనలో ఉపాధ్యాయులు మూర్తి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



మునగపాక అభయాంజనేయ స్వామి ఆలయంలో చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

మునగపాక : స్థానిక సంతబయిల అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో పారాయణం నిర్వహించారు. జూన్ 1వ తేదీన అభయాంజనేయ స్వామి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అభయాంజనేయ స్వామిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని కోరారు.